నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

3 | మహబూబ్‌నగర్, శనివారం 6 ఏప్రిల్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


# బొలేరో బోల్తా.. ఇద్దరు మృతి



ఉత్తనూరు వద్ద బోల్తా పడిన బొలేరో

అయిజ, ఏప్రిల్ 5 : దైవదర్శనార్థం వెళ్తుండగా బొలేరో బోల్తాపడి ఇద్దరు మృతి చెందిన ఘటన శుక్రవారం ఉత్తనూరు సమీపంలో చోటు చేసుకున్నది. ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం మేరకు.. కర్ణాటకలోని మీర్జాపురం, ఇడుపునూరు గ్రామాలకు చెందిన బంధువులు కర్నూల్ జిల్లాలోని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం శుక్రవారం ఆయా గ్రామాల నుంచి దాదాపు 25మంది భక్తులు బయలుదేరారు. మార్గమధ్యలోని అయిజ మండలం ఉత్తనూర్ గ్రామ సమీపంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బొలేరో వాహనంలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందిన చుట్టుపక్కల రైతులు, ఉత్తనూర్ గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించి, క్షతగాత్రులను 108లో దవాఖానకు తరలించారు. తీవ్రగాయాలైన నాగప్ప, మనోజ్, రంగప్ప, నర్సమ్మలను కర్నూల్, రాయిచూర్ దవాఖానలకు తరలించారు. కర్నూల్‌కు తరలిస్తుండగా గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి లక్ష్మి, నాగప్పల కుమారుడు మనోజ్ (9), మీర్జాపురం నాగప్ప(45) మార్గ మధ్యలో మృతి చెందారు. రంగప్ప కర్నూల్, నర్సమ్మ రాయిచూర్‌లో చికిత్స పొందుతున్నారు. స్వల్పగాయాలైన క్షతగాత్రులకు అయిజలో చికిత్స అందించి సొంత గ్రామాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. దైవదర్శనార్థం వెళ్తున్న భక్తులు ప్రమాదబారిన పడి మృత్యువాత పడడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.



# ఈత కోసం..

*ఈత కోసం కొందరు యువకులు 12 కిలోమీటర్లు ప్రయాణించి సరదాను తీర్చుకొంటున్నారు. శివనంపల్లె గ్రామ సమీపంలోని బావిలో గద్వాల మండలం రేపల్లె గ్రామానికి చెందిన పలువురు వచ్చి ఈత కొడుతున్నారు. వారి గ్రామాల పరిధిలో అన్ని బోరుబావులు ఎండిపోవడంతో నిత్యం బైక్‌లపై వచ్చి స్విమ్ చేస్తున్నారు.*

*– ఇటిక్యాల, ఏప్రిల్ 5*





దివిటిపల్లి సమీపంలో నిర్మించిన ఐటీ పార్కు

- పాలమూరులో ఐటీ వెలుగులు ప్రసరించేనా..?
- పథకం ప్రకారమే కొందరి దుష్ప్రచారం
- జీరో పర్సెంట్ కాలుష్య రహితంగా లిథియం గిగా బ్యాటరీ కంపెనీ
- గతంలోనే 13 కంపెనీలతో కేసీఆర్ సర్కారు ఎంవోయూ
- మూడు కంపెనీల కార్యకలాపాలు
- ప్రశ్నార్థకంగా కంపెనీల రాక
- కాంగ్రెస్ ప్రభుత్వం సపోర్ట్ లేక రానంటున్న మిగితా కంపెనీలు
- ఆందోళనలో నిరుద్యోగులు

# నీలినీడలు !

## దివిటిపల్లి ఐటీ పార్కుపై శీతకన్ను

**సీఎం సొంత జిల్లాలో పట్టించుకోని వైనం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఐటీ ఇండస్ట్రీయల్ టవర్‌ను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనివల్ల నిరుద్యోగులకు భరోసా లేకుండా పోయింది. ప్రభుత్వ విధానాలు ఏమున్నా సొంత జిల్లాపై రేవంత్ ప్రత్యేక దృష్టి సారించి ఐటీ టవర్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలను రప్పించి ఈ ప్రాంతానికి మేలు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. లేదంటే నిరుద్యోగులకు ఆందోళన తప్పదు.

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : యువతకు ఉద్యోగాలతోపాటు ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఐటీ పార్కుపై నీలినీడలు కమ్ముకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని దివిటిపల్లి శివారులో గత ప్రభుత్వం 400 ఎకరాల్లో సుమారు రూ.40కోట్ల వ్యయంతో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టింది. టైర్ టూ పట్టణాల్లో ఐటీ పార్కులను కేసీఆర్ సర్కారు ప్రోత్సహించింది. ఇందులో భాగంగా వెనుకబడిన జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన నిర్మాణం పూర్తి చేసుకున్నది. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీ ఎనర్జిటిక్ పార్కును పట్టించుకోవడం మానేసింది. రేవంత్ సర్కారు నిర్లక్ష్యంతో ఐటీ వెలుగులు ప్రసరిస్తాయో లేదో నన్న అనుమానాలు నిరుద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఎందరో ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఐటీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. అయితే స్థానికంగా ఐటీ టవర్ ఏర్పాటుతో ప్రముఖ కంపెనీలన్నీ ఇక్కడి నుంచే వారి కార్యకలాపాలు నిర్వహించనున్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉండేలా నిర్మాణం చేపట్టారు. ప్రత్యక్షంగా.. పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి లభించడంతోపాటు చుట్టుపక్కల గ్రామాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. మహబూబ్‌నగర్ జిల్లా రూపురేఖలు మారే దశలో కాంగ్రెస్ సర్కారు శీతకన్ను పడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా దేశంలోనే తొలి లిథియం అయాన్ గిగా ఫ్యాక్టరీ కోసం 150 ఎకరాలు దివిటిపల్లి సమీపంలోనే కేటాయించారు. రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీ అయిన అమరరాజ ఈవీ ఫ్యాక్టరీకి కేసీఆర్ ప్రభుత్వం అంకురార్పణ చేసింది. జీరో పొల్యూటెడ్‌గా ఈ గిగా ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారు. కంపెనీ ఏర్పాటుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతమయ్యే అవకాశం ఉన్నది. గత కొన్ని రోజులుగా కొందరు ఆందోళనలు చేపడుతున్నారు. ఇటు ఐటీ టవర్‌పై.. అటు ఈవీ ఫ్యాక్టరీపై రాష్ట్ర ప్రభుత్వ విధానమేమిటో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### 13 కంపెనీలతో ఎంవోయూ

వలసలు, కరువుకు నిలయమైన మహబూబ్‌నగర్ జిల్లాలో ఐటీ టవర్ నిర్మాణం ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం సుమారు 13 కంపెనీలతో ఎంవోయూ కుదుర్చుకున్నది. ప్రస్తుతం మూడు కంపెనీలు మాత్రమే ఇక్కడి నుంచి వారి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారి 44కు అతి సమీపంలో, దివిటిపల్లి శివారులో ఏర్పాటు చేసిన ఐటీ పార్క్‌తో చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరాకు రూ.4 నుంచి 5 లక్షలు పలకని భూముల ధరలు నేడు రూ.కోటి నుంచి రూ.కోటిన్నరకు చేరాయి. హైవే నుంచి నేరుగా పార్కు మీదుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి నాలుగులేన్ల రహదారి నిర్మాణమైంది. హైదరాబాద్ నుంచి తరలివచ్చే ఐటీ ఉద్యోగులకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతున్నది. దివిటిపల్లి, అంబటిపల్లి, ఎదిర గ్రామాలతోపాటు మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ ప్రాంతాలు ఊహించని రీతిలో అభివృద్ధిలో పరుగులు పెట్టే అవకాశమున్నది. అయితే రేవంత్ సర్కారు వీటిపై దృష్టి సారించకపోవడంతో వీటి ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేకుండా ఏర్పాటు చేయలేమని సదరు కంపెనీ నిర్వాహకులు అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది.

### దేశంలోని తొలి గిగా ఫ్యాక్టరీ ఇక్కడే..

ఎలక్ట్రానిక్ యుగం పరుగులు తీస్తున్నది. ఈ నేపథ్యంలోని మహబూబ్‌నగర్ ఐటీ పార్కులో రూ.9వేల కోట్ల పెట్టుబడితో అమరరాజా కంపెనీ లిథియం గిగా ఫ్యాక్టరీ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఈ ఫ్యాక్టరీ నిర్మాణంతో ఇక్కడ తయారయ్యే బ్యాటరీలు దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాలకు ఎంతో ఉపయోగం కానున్నాయి. ఇది దేశంలోనే తొలి గిగా ఫ్యాక్టరీ. దీంతో మహబూబ్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. యూఎస్, చైనా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 240 గిగా ఫ్యాక్టరీల విప్లవానికి నాయకత్వం వహిస్తున్నాయి. మనదేశంలో మహబూబ్‌నగర్ ప్రాంతంలో ఏర్పాటు కానుండడంతో ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగు పడనున్నాయి. జీరో పర్సెంట్ కాలుష్య రహితంగా కంపెనీని నిర్మిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఇతర అనుబంధ పరిశ్రమల పెట్టుబడులు ఈ ప్రాంతానికి తరలివచ్చే అవకాశమున్నది. సప్లయర్లు, సర్వీస్ ప్రొవైడర్లు రావడంతో అదనపు ఉద్యోగావకాశాలు వస్తాయని భావిస్తున్నారు .

### కాలుష్య రహితంగా..



దివిటిపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న అమరరాజా లిథియం బ్యాటరీ కంపెనీ

లిథియం గిగా ఫ్యాక్టరీ వద్దని కొన్ని రోజులుగా కొందరు ఆందోళనకు దిగుతున్నారు. కానీ పూర్తిగా కాలుష్య రహితంగా ఉంటుందని గత ప్రభుత్వం వెనుకబడిన మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముడి పదార్థాలు పర్యావరణ అనుకూల వనరుల నుంచి తీసుకుంటాయని నిర్ధారించింది. కార్బన్ ఫుట్ ప్రింట్స్‌ను తగ్గించడానికి సౌర, పవన శక్తి (సోలార్ అండ్ విండ్ పవర్) వంటి పునరుత్పాదక ఇంధన వనరులను కూడా ఉపయోగించడంతో కాలుష్యం పూర్తిగా తగ్గనున్నది. గిగా ఫ్యాక్టరీల సర్క్యులర్ వాల్యూ చెయిన్స్‌ను అనుసరిస్తాయి. ఇందులో ఉపయోగించిన పదార్థాలు వృథా కాకుండా రీసైకిల్ చేయబడతాయి. అదనంగా ఆటోమేషన్ ద్వారా సుస్థిరతను స్వీకరిస్తాయని తేలింది. సంప్రదాయ బ్యాటరీ ఫ్యాక్టరీల కాకుండా ఎక్కువ కంప్యూటర్, రోబోటిక్స్ పద్ధతులను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి హాని కాదని తేలింది. అంతేకాకుండా ఎలక్ట్రిక్ వాహనాలకు బ్యాటరీలు ఇక్కడ తయారు చేసి దేశవ్యాప్తంగా ఎగుమతి చేయనున్నారు.

## లోక్‌సభ ఎన్నికలకు పటిష్ట భద్రత

- ఐటీబీపీ బలగాల డీఐజీ సురేందర్ కత్రి

గద్వాల అర్బన్, ఏప్రిల్ 5 : లోక్‌సభ ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత కల్పించాలని ఐటీబీపీ బలగాల డీఐజీ సురేందర్ కత్రి ఆదేశించారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని ఆయన వివరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ చాంబర్‌లో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో అనుసరించాల్సిన విధివిధానాలు, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నగదు, మద్యం రవాణా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. జిల్లాలో కొనసాగుతున్న కేంద్ర బలగాల కవాతు, వాహనాల తనిఖీలు, జిల్లాకు వచ్చే కేంద్ర బలగాలకు అవసరమైన వసతులు కల్పించే విషయంపై చర్చించారు. సమీక్షలో అదనపు ఎస్పీ గుణశేఖర్, ఐటీబీపీ కమాండెంట్ జోషి, డిప్యూటీ కమాండెంట్ బీఎస్‌రెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ, సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్ వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఐటీబీపీ బలగాల డీఐజీ సురేందర్ కత్రి

## నేడు రైతుల సమస్యలపై వనపర్తిలో ధర్నా

వనపర్తి, ఏప్రిల్ 5 : రైతుల సమస్యలపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు, ఆత్మహత్య చేసుకున్న 200 మంది రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరుతూ ఆందోళన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ మండల, పట్టణ, గ్రామాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, రైతులు హాజరుకావాలన్నారు.

## ఇఫ్తార్ విందు ఐక్యతకు నిదర్శనం

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



జడ్చర్ల టౌన్ : విందులో పాల్గొన్న ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 5 : ఇఫ్తార్ విందులు ఐక్యతకు నిదర్శమని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 18వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకుడు మొఖిద్ స్వగృహంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మన్నె, లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ముస్లింలకు ఖర్జూర పండ్లు తినిపించి ఉపవాసదీక్షను విరమింపజేశారు. అనంతరం బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులతో కలిసి ఎంపీ మన్నె, లక్ష్మారెడ్డి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శం

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల అర్బన్, ఏప్రిల్ 5 : ఉప ప్రధాని, కార్మిక శాఖ మంత్రిగా దేశ అభివృద్ధి ప్రదాతగా బాబూ జగ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరంతర కృషి వలుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఎంపీపీ విజయ్‌కుమార్, గడ్డం కృష్ణారెడ్డి, రామేశ్వరమ్మ, మురళి తదితరులు ఉన్నారు.



గద్వాల క్యాంప్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## స్థానికుడిని ఆదరించాలి

- వలసవాదిని తరిమికొట్టండి
- అమరుల త్యాగం మరువలేనిది
- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- కాంగ్రెస్ ప్రతీకారాలు మాని పాలనపై దృష్టి పెట్టాలి
- గులాబీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు





అచ్చంపేటలో ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 5 : తెలంగాణ సాధనలో అమరుల త్యాగం మరువలేనిది.. వలసవాదిని తరిమికొడదాం, స్థానికుడిని ఆదరిద్దామని బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం అచ్చంపేటలోని బీకే ఫంక్షన్ హాల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ఆర్‌ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వంలోకి రాగానే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామన్న హామీ ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే తిరగబడుతామన్నారు. గత పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని గుర్తు చేశారు. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా బీఆర్‌ఎస్ నాయకులు కలిసికట్టుగా లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గువ్వల బాలరాజు మాట్లాడుతూ అక్రమ మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బల్మూర్ మండలం మైలారంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే ప్రభుత్వం అండతో కొంతమంది అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. తవ్వకాలను నిలిపి వేయాలని పార్టీ శ్రేణులతో కలిసి శాంతియుతంగా మైలారం బయలుదేరితే ప్రభుత్వం అచ్చంపేట శివారులోనే పోలీసులతో అడ్డుకున్నదని విమర్శించారు. గతంలో సేవ్ నల్లమల పేరుతో కేంద్రం బలవంతంగా యురేనియం తవ్వకాలను జరిపేందుకు ప్రయత్నిస్తే అసెంబ్లీ సాక్షిగా అడ్డుకున్నానని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులపై పగలు, ప్రతీకారాలను పక్కన పెట్టి ప్రజాపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. అణచివేతలే ప్రభుత్వ అజెండాగా భావిస్తే దాడులకు ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అభిలాష్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, పదర జెడ్పీటీసీ రాంబాబునాయక్, వంగూరు ఎంపీపీ భీమమ్మ, లాలయ్యగౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ నరసయ్యయాదవ్, గోపాల్‌రెడ్డి, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.



పార్లమెంట్ సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

## కవి సమ్మేళనం విజయవంతం

పాలమూరు, ఏప్రిల్ 5 : సమాజంలో భాషా వికాసం, సాహిత్య విలువలు పెంపొందించడానికి సాహిత్యం దోహదం చేస్తుందని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కశిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్కౌట్స్‌గైడ్స్ భవనంలో శుక్రవారం తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సాహిత్య సంస్థ పలు సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నదన్నారు. అనంతరం కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాహిత్యానికి కొదువ లేదన్నారు. పాలమూరు జిల్లాలో ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధ్యక్షురాలు వనజ పేర్కొన్నారు. సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న నందాపురం బుచ్చయ్య, డా. గన్నోజు శ్రీనివాసాచారి, అల్వాల లక్ష్మణమూర్తి, సాయి మనస్విని తదితర కవులు కవితలతో అలరించారు. అనంతరం కవులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీదేవి, శాంతారెడ్డి, అనురాధ, సక్కుబాయి, జనార్దన్, ఖాజామైనుద్దీన్, జగపతిరావు, లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

నారాయణపేట, ఏప్రిల్ 5 : పట్టణంలోని శాతవాహన కాలనీలోని గొర్రెల వధశాల వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తిని హత్య చేసి కాల్చివేసిన సంఘటన చోటుచేసుకున్నది. డీఎస్పీ లింగయ్య శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన దాసరి మారుతి (40) హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. నాలుగు రోజుల కిందట పట్టణానికి వచ్చాడని, గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో కొట్టి చంపి మృతదేహాన్ని కాల్చి వేసినట్లు తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో విచారణ చేపట్టి, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.